# స్థానికుడా.. స్థానికేతరుడా?

- ఎవరు కావాలో ప్రజలే ఆలోచించాలి
- బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 4 : స్థానిక నాయకుడు కావాలో.., స్థానికేతరుడైన నాయకుడు కావాలో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలే తేల్చుకోవాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10, 11, 12 వార్డుల్లో శనివారం తన సతీమణి జయతారతో కలిసి చిన్నయ్య ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే కాంగ్రెస్ నాయకులు కావాలా..? నిత్యం ప్రజల మధ్య ఉండే బీఆర్ఎస్ నాయకులు కావాలా అని ప్రజలను కోరారు. ఎన్నికల సమయంలో డబ్బు మూటలతో వచ్చి ఓట్లు అడగడం తప్పా వారు చేసిందేమి లేదని విమర్శించారు. సమయానుకూలంగా పార్టీ మార్చే నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆరోపించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేసిన అభివృద్ధిని చూసి, బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. 2014కు ముందు నియోజకవర్గ పరిస్థితి, ప్రస్తుత పరిస్థితిని ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల సమయంలో కనిపించే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ర్టానికి సీఎం కేసీఆరే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. కలకాలం సీఎంగా ఉండి నిరుపేదలకు సాయం చేయాలన్నారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నర ఏళ్లలో 60 ఏండ్లుగా జరగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపించారని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో 100 మంది చేరిక..**

వేమనపల్లి మండలం చామనపల్లి పంచాయతీ పరిధి బద్దంపల్లికి చెందిన 100 మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. తన నివాసంలో దుర్గం చిన్నయ్య వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బెల్లంపల్లి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య





పార్టీలో చేరుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, సీనియర్ నాయకుడు కొట్నాక రమేశ్‌కు గులాబీ కండువాలు కప్పుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి అల్లోల, ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

# కాంగ్రెస్‌కు భారీ షాక్

- పార్టీకి గుడ్‌బై చెప్పిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి, సీనియర్ నాయకులు
- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక
- తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచ్చయ్య సైతం..
- కారెక్కేందుకు క్యూ కడుతున్న నేతలు

ఉట్నూర్/ఆసిఫాబాద్, నవంబర్ 4 : కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. ఆసిఫాబాద్ నియోజవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆశించి నిరాశ ఎదుర్కొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి.., ఆదివాసులకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాధాన్యమివ్వకపోవడంతో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచ్చయ్య.., ఉట్నూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొట్నాక రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, సీనియర్ నాయకులు మంగం విషంరావు, అర్క సీతారాం, అడ్వకేట్ పెందూర్ ప్రభాకర్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో పెందూర్ పుష్పారాణి, పలువురు చేరగా, తాజాగా వీరు శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. గిరిజనుల చిరకాల స్వప్నం పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలుపుంచుకోవాలని సూచించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదివాసుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. 70 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి బీఆర్ఎస్ చేసి చూపించిందని, అందుకే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. గిరిజన గ్రామాలకు తాగునీరు, బీటీ రోడ్లు వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. వావనాటే మావరాజ్ కావాలని కోరే ఆదివాసులకు 500 జనాభా గల గ్రామాలను పంచాయతీలుగా మార్చి, స్థానిక యువతకు నాయకత్వం అందించారని, దండారీలకు రూ.10 వేలు, ఆదివాసీ దేవాలయాలకు నిధులు, కెస్లాపూర్‌కు నిధులు, కుమ్రం భీం జోడేఘాట్‌లో మ్యూజియం, గిరిజన గ్రామాలకు మంచినీరు, గిరిజనుల స్వప్నం పోడు పట్టాలు ఇవ్వడంతోపాటు, రైతు బంధు, రైతు బీమా అందించారని, గిరిజన రిజర్వేషన్ పెంచారని వెల్లడించారు. అలాగే జీవో నంబర్ 3 పునరుద్ధరించాలని, ఐటీడీఏ ఆధ్వర్యంలో డీఎస్సీ వేయాలని, ఉద్యోగాలు ఆదివాసీ యువతతో భర్తీ చేయాలని మంత్రి కేటీఆర్‌ను కోరినట్లు వారు తెలిపారు. అడకగకముందే ఎన్నో చేసిన సీఎం కేసీఆర్.. మరిన్ని చేసి, ఆదివాసుల అభ్యున్నతికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు అబ్దుల్లా, ఆత్రం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**ఆకర్షితురాలినయ్యే పార్టీలో చేరిన..**

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 4 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో తనను పార్టీలో చేరేలా చేసిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం, ఆమె మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టి, చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇటీవల ప్రకటించిన మ్యానిఫెస్టోకు ఆకర్షితురాలినయ్యే పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మేజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# సభను విజయవంతం చేయాలి

- ఈ నెల 7 మందమర్రిలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ
- చెన్నూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- యువజన, విద్యార్థి సంఘాలు, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలతో సమావేశం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మందమర్రి, నవంబర్ 4 : మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో ఈ నెల 7న నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని చెన్నూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలోని బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద శనివారం పార్టీ యువజన, విద్యార్థి సంఘాలు, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో యువకులు పాల్గొని, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సీఎం కేసీఆర్ సభలో వలంటీర్లుగా వ్యవహరించి, సభకు వచ్చే ప్రజలకు సేవలందించాలని అన్నారు. సమావేశంలో చెన్నూర్ ప్రగతి ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకంలో పొందుపరిచిన అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రగతి ప్రస్థానం పుస్తకాన్ని చదివి, అందులోని అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి చైతన్యం కలిగించాలని కోరారు. కష్టపడే యువకులకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

**బీఆర్ఎస్‌లో 200 మంది చేరిక..**

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన 200 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకానితో కలసి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు జరిపిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జే రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ యువజన, విద్యార్థి, సోషల్ మీడియా నాయకులు

# మాయమాటలు విని మోసపోవద్దు

- కారుగుర్తుకే ఓటు వేయండి
- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, నవంబర్ 4 : 'ఎన్నికల సందర్భంగా పగటివేషగాళ్లు మీ ముందుకు వస్తారు, గారడీలు చేస్తారు, మాయ మాటలు చెప్పి మోసం చేయాలని చూస్తరు. వారిని నమ్మవద్దు. మీ కండ్ల ముందు అభివృద్ధి కనిపిస్తున్నది. ఎవరు అభివృద్ధి చేశారో వారిని గుర్తించి, వారికే ఓటు వేయండి..' అని మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఓటర్లను అభ్యర్థించారు. మంచిర్యాల పట్టణంలోని నాలుగోవార్డు సున్నంబట్టి వాడ, 12వ వార్డు గోపాల్‌వాడలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాల్గోవార్డులో కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 మంది మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడారు. ఎప్పుడూ ఇటుపక్క రాని ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు ఎందుకు వస్తున్నారో అర్థం చేసుకోవాలని, ఎన్నికల్లో గెలవడం కోసం ఏమైనా మాట్లాడుతారని ప్రజలకు సూచించారు. మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకు సాగుతాయన్నారు. అన్ని రకాలుగా ప్రజల సంక్షేమాన్ని కోరుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సుజాత, నల్ల శంకర్, పోరెడ్డి రాజు, బీఆర్ఎస్ నాయకులు పడాల రామన్న, పడాల మాధవి, బగ్గని రవికుమార్, శ్రీపతి వాసు, సాగర్‌యాదవ్, పానగంటి శ్రీనివాస్, పడాల రవీందర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.



సున్నంబట్టి వాడలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు